# దామోదర్‌కు దళితులంటే చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

- అందోలు దళితులను ఎదగనివ్వడం లేదు
- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

చౌటకూర్, అక్టోబరు 25: అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలో దామోదర్ రాజనర్సింహ దళితులను ఎదగనివ్వడంలేదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య ఆరోపించారు. మండలంలోని శివంపేట గ్రామ శివారులో బుధవారం మాల, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన దళిత యువకులతో సమావేశం నిర్వహించారు. ముప్పై ఏండ్లకు పైగా రాజకీయాల్లో కొనసాగుతున్న దామోదర్ నియోజకవర్గానికి చెందిన ఏ ఒక్క దళిత నాయకుడికి రాష్ట్రస్థాయి పదవులు ఇప్పించలేదని ఆరోపించారు. ఆరవై ఏండ్లుగా నియోజకవర్గం ఎస్సీలకు కేటాయించినప్పటి నుంచి స్థానికులను అసెంబ్లీకి ఎన్నికకాకపోవడం సిగ్గుచేటన్నారు. గత ఎన్నికల వరకు కూడా కాంగ్రెస్, టీడీపీల తరపున అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొంది, మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. అయినప్పటికీ నియోజకవర్గం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికుడు, జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నేత చంటి క్రాంతికిరణ్‌కు సీఎం కేసీఆర్ అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం కల్పించడంతో ఎమ్మెల్యేగా గెలుపొంది, ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. దామోదర్ ఇప్పటివరకు 8 పర్యాయాలు పోటీ చేసి కేవలం మూడు పర్యాయాలు మాత్రమే ఎమ్మెల్యేగా గెలుపొంది, ఐదు పర్యాయాలు ఓటమిని చవిచూశారన్నారు. మరోసారి ఓటమి చెందడం ఖాయమని జోస్యం చెప్పారు. తన రాజకీయ జీవితంలో దామోదర్ దళితులను అణగదొక్కడానికి అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. స్థానికేతరుడైన దామోదర్ అందోలులో దళిత దొరగా చెలామణి అవుతూ దళితులను రాజకీయ, ఆర్థికంగా ఎదగనీయకుండా వారిని కేవలం ఓటర్లుగానే పరిగణిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో స్థానికేతరులైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మరోసారి భంగపాటు తప్పదన్నారు. స్థానికుడు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే చంటి క్రాంతికిరణ్‌ను మరో పర్యాయం గెలిపించేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారన్నారు. దళితబంధు పేరుతో నియోజకవర్గంలో మాల, మాదిగలను రెచ్చగొడుతూ వారిని విడదీసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. స్థానిక అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్‌ను మరోమారు గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దళిత యువకుల అభ్యున్నతికి ఆహర్నిశలు శ్రమిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నదన్నారు. క్రాంతికిరణ్ గెలుపునకు సహకరించేందుకు ఊరు, వాడా పర్యటిస్తున్నామన్నారు. వారిని ఏకం చేసి బీఆర్‌ఎస్ గెలుపులో భాగస్వాములను చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు చిట్కుల శ్రీనివాస్, తలారి దేవయ్య, సోల్కంపల్లి రాజు, సంతోష్‌కుమార్, ఏర్పుల రాజేందర్, బేగరి అశోక్, తలారి యాదయ్య, సరఫ్‌పల్లి రాములు, గంగాధరి ప్రసాద్, వెండికోల్ కుమార్, నర్సింలు, సాయి, కృష్ణ, పోచయ్య, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రావెల్స్‌లో వెండి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

# తనిఖీల్లో 19 కిలోల వెండి స్వాధీనం

మునిపల్లి, అక్టోబర్ 25: ఇతర రాష్ర్టాల నుంచి ఎలాంటి అనుమతులు, రసీదులు లేకుండా తెలంగాణకు తరలిస్తున్న రూ.15 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు, వెండి గిఫ్ట్ ఆర్టికల్స్‌ను మునిపల్లి మండలంలోని కంకోల్ డెక్కన్ టోల్ ప్లాజా వద్ద ట్రావెల్స్ బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌రావు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముంబాయి జాతీయ రహదారిపై గల కంకోల్ టోల్‌ప్లాజా వద్ద సంబంధిత అధికారులు నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగానే రాజస్థాన్ నుంచి హైదరాబాద్ వస్తున్న బీఆర్ ట్రావెల్స్ బస్సులో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ బస్సులో ప్రయాణిస్తున్న (రాజస్థాన్) ప్రాంతానికి చెందిన నరేందర్ సిర్వి దగ్గర ఎలాంటి అనుమతులు, రసీదులు లేకుండా తరలిస్తున్న 19.270 కిలోల వెండి గిఫ్ట్ ఆర్టికల్స్ లభించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వెండి గిఫ్ట్ ఆర్టికల్స్‌కు సంబంధించి సరైన పత్రాలు లేనందున ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అందోల్-2 అధికారులకు తనిఖీల్లో పట్టుబడ్డ గిఫ్ట్ ఆర్టికల్స్‌ను అప్పగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలి
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



అధికారులతో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 25: శాంతియుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. బుధవారం సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయంలో కేంద్ర బలగాల బీఎస్‌ఎఫ్, ఎస్‌ఎస్‌బీ అధికారులు, స్థానిక ఏసీపీలతో చెక్ పోస్ట్స్, వెహికిల్ చెకింగ్, ఫ్లాగ్ మార్చ్, ఈవీఎం వీవీ ప్యాట్, స్ట్రాంగ్ రూమ్ బందోబస్తు గురించి సీపీ శ్వేత సమీక్ష నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్ అధికారులకు జిల్లా భౌగోళిక పరిస్థితులు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి గురించి సీపీ శ్వేత వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా, ఓటర్లకు భయాందోళనలకు గురికాకుండా, తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వేయడానికి భరోసా కల్పించడంలో భాగంగా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్‌లు వాహనాలు తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు నచ్చిన వ్యక్తికి, మెచ్చిన వ్యక్తికి స్వేచ్ఛగా ఓటేసేలా అన్ని రకాల చర్యలు తీసుకోనున్నామన్నారు. ఎన్నికల ముందు తరువాత నిర్వహించే విధుల గురించి వివరించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. కీలకమైన ప్రదేశాల్లో సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర బలగాలు ఉండేందుకు సరైన వసతి ఏర్పాట్లు చేయాలని, వారితో కలిసి పని చేయాలని ఏసీపీలను సీపీ ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కేంద్ర బలగాలతో, జిల్లా పోలీసులతో సిద్దిపేట జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బీఎస్‌ఎఫ్ కమాండెంట్ ఇంద్రజిత్ చావ్లా, ఎస్‌ఎస్‌బీ కమాండెంట్ రఘునాథ్, అడిషనల్ కమాండెంట్ రవి, అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్ కుమార్, ధర్మరాజ్, ఎస్‌ఎస్ రాథోడ్, రవి, సురేష్, అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, మల్లారెడ్డి, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రమేశ్, సతీశ్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, రవీందర్‌రాజు పాల్గొన్నారు.


# పారిశ్రామికవాడలో వ్యక్తి దారుణ హత్య



అజీమ్(ఫైల్)

బొల్లారం, అక్టోబర్ 25: ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అజీమ్ (34) బతుకుతెరువు నిమిత్తం బొల్లారం పారిశ్రామికవాడలోని గాంధీనగర్‌లో భార్యా కుమారుడితో జీవనం కొనసాగిస్తున్నాడు. అజీజ్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి మంగళవారం మద్యం సేవించాడు. ఈ క్రమంలో వారి మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో క్రోపోదిక్తులైన వారు మహ్మద్ అజీమ్ తలపై బండరాయితో బాది హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. హత్యకు గల కారణాలపై పోలీసులు ఘటనా స్థలంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యోదంతంతో బొల్లారం పారిశ్రామిక వాడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

# వ్యక్తి చంపిన తల్లీకొడుకులు



మొగులయ్య మృతదేహం

మునిపల్లి, అక్టోబర్ 25: గ్రామంలో అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తిని తల్లీకొడుకులు కిందపడేసి కొట్టి చంపేసిన ఘటన మండలంలోని పోల్కంపల్లిలో బుధవారం జరిగింది. కొండాపూర్ సీఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ముత్యాల మొగులయ్య(45) ఇంటి సమీపంలోని నీటి సంపు వద్ద కూర్చోని అదే గ్రామానికి చెందిన ముత్యాల లలితను ఇష్టానుసారంగా తిట్టాడు. దీంతో ముత్యాల లలిత కోపంతో ముత్యాల మొగులయ్యను సంపుపై నుంచి కింద పడేసి కొడుతుండగా ఇది గమనించిన ఆమె కుమారుడు బాబు వచ్చి ఇష్టానుసారంగా మొగులయ్యను తన్నడంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. ముత్యాల మొగులయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్, మునిపల్లి ఎస్సై సురేశ్ పరిశీలించారు.

# శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

- రౌడీ షీటర్లను హెచ్చరించిన సంగారెడ్డి ఎస్పీ రూపేశ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు, అక్టోబర్ 25: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన రౌడీషీటర్లు, కేడీలు, పాత నేరస్తులు 104 మందితో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామ పరిధిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ కార్యక్రమానికి ఎస్పీ సీహెచ్ రూపేశ్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నాయని, వాటిలో మీరు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని ఎస్పీ సూచించారు. ఎవరైనా ఎన్నికల్లో నేర కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో, వేరే మార్గాల్లో నేర చర్యలకు పాల్పడితే, ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎవరిని బెదిరించినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కల్పించినా కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు చక్కగా, శాంతియుతంగా జీవించాలన్నారు. లేని పక్షంలో బైండోవర్ చేస్తామన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు పోలీసుశాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. అందరిపై నిఘా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పౌరులపైనను చర్యలుంటాయని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వినాయక్‌రెడ్డి, సీఐ లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కరుణాకర్ (ఫైల్)

నర్సాపూర్, అక్టోబర్ 25: ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తుల్జారాంపేట సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన తలారి కరుణాకర్ (22) హత్నూర మండలంలోని చందాపూర్‌లోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తూ జీవిస్తున్నాడు. రోజులాగే కరుణాకర్ బుధవారం తెల్లవారు జామున నర్సాపూర్ వచ్చి పెట్రోల్ పోసుకుని పరిశ్రమకు వెళ్తుండగా తుల్జారాంపేట సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి, చెట్టును ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ కుమార్ తెలిపారు.